రైళ్లలో మరిచిపోయిన వస్తువుల అప్పగింత



పోగొట్టుకున్న బ్యాగులను అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

అడ్డగుట్ట: రైళ్లలో ప్రయాణికులు మరిచిపోయి, పోగొట్టుకున్న వస్తువులను భద్రంగా యజమానులకు అందజేస్తున్నామని ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎంవీ రెడ్డి పేర్కొన్నారు. ఆపరేషన్ అమానత్‌లో భాగంగా 2024లో ఇప్పటి వరకు ప్రయాణికులు మరిచిపోయిన, పోగొట్టుకున్న సుమారు రూ. 17.13 లక్షల విలువగల సామగ్రి, ఇతర వస్తువులను యజమానులను అప్పగించినట్లు చెప్పారు.

- మహారాష్ట్రకు చెందిన అచాల అశోక్ శుక్రవారం రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా అతడి రూ. 2 వేల విలువ గల ఇయర్ ఫోన్స్ మర్చిపోయాడు. ఈ క్రమంలో ఆర్పీఎఫ్ పోలీసులు సదరు ఇయర్ ఫోన్స్‌ను ఆర్పీఎఫ్ కార్యాలయానికి తీసుకొచ్చి భద్రపరిచారు. శనివారం ఇయర్ ఫోన్స్‌కు సంబంధించి యజమానిని గుర్తించిన పోలీసులు ఆయనకు అందజేశారు.
- వరంగల్ రైల్వే స్టేషన్‌లో వాటర్ బాటిల్ కోసం రైలు దిగి లగేజీ బ్యాగును పోగొట్టుకున్న ప్రయాణికుడి బ్యాగులను స్వాధీనం చేసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సదరు యజమానికి అప్పగించారు.
- ఆదిలాబాద్‌కు చెందిన గణేష్ సర్దార్ అనే వ్యక్తి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా వరంగల్ స్టేషన్‌లో వాటర్ బాటిల్ కోసం రైలు దిగాడు. ఈ క్రమంలో రైలు వెళ్లిపోవడంతో స్థానిక రైల్వే పోలీసులకు విషయం చెప్పడంతో వెంటనే పోలీసులు సదరు యజమాని బ్యాగును సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. శనివారం సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ కార్యాలయంలో యజమానికి బ్యాగులను అందజేశారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అడ్డగుట్ట: ఆర్య వైశ్య సంఘం తుకారంగేట్ ఆధ్వర్యంలో శనివారం కన్యకాపరమేశ్వరీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అడ్డగుట్టలోని సంఘం కార్యాలయంలో ఉదయం నుంచి ఆర్యవైశ్య కుటుంబాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సారి కూడా కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించామని, వైశ్య కుటుంబీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కోశాధికారి శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో..



అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ దీపిక

రాంగోపాల్‌పేట్: శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవీ జయంత్యుత్సవాలను రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని ఆవులమంద అమ్మవారి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, అలంకారం, లక్షపుష్పార్చన, సామూహిక కుంకుమార్చన, మధ్యాహ్నం మహా హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా అమ్మవారిని రథంలో ఉంచి సికింద్రాబాద్‌లోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు చందా బాలేందర్, కార్యదర్శి తమ్మి వెంకటేష్, కోశాధికారి మనుసాని శరత్‌బాబులతో పాటు కార్యవర్గ సభ్యులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు. మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఇంకని గుంతలు!

- ఇంకుడు గుంతల పునరుద్ధరణపై నిర్లక్ష్యం
- కనుమరుగవుతున్నా పట్టించుకోని వైనం
- దృష్టి సారించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు



జెక్‌కాలనీ నుంచి హనుమాన్ దేవస్థానానికి వెళ్లే రోడ్డులో కనుమరుగైన ఇంకుడు గుంత



ఆకృతి నివాస్ సమీపంలో ఇంకుడుగుంతలోకి నీరు వెళ్లేందుకు వీలు లేకుండా మారిన దృశ్యం

సనత్‌నగర్: పరిమితికి మించి లోపలికి వెళ్లిన పాతాళ గంగ జాడ కానరాదు..నీటి జాడ లేక బోర్లు కాస్తా బావురుమంటున్నాయి. ఈ క్రమంలో భూగర్భ జలసిరి పెంచేందుకు ఇంకుడు గుంతలే శరణ్యం. అలాంటి ఇంకుడుగుంతల తీరు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. మండు వేసవిలోనూ అడపాదడపా వర్షాలు పడుతుండగా, ఈ ఏడాది నైరుతి పవనాలు ముందస్తుగా వస్తాయన్న వార్తలు వస్తుండగా ఇంకుడుగుంతల పునరుద్ధరణపై ధ్యాస మాత్రం అధికారులకు కనిపించడం లేదు. గతంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు ఒక యజ్ఞంలా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద కూడా పలువురు ఇంకుడుగుంతల నిర్మాణానికి ముందుకొచ్చి నిధులు వెచ్చించారు. అయితే వాటి నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు.



పునరుద్ధరణపై దృష్టి పెట్టాలి..

ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకుడుగుంతల ఆవశ్యకత చాలా ఉంది. చాలా బోర్లు పనిచేయడం లేదు. ఇంకుడుగుంతల ద్వారా భూమిలోకి ఇంకే నీటితోనైనా బోర్లకు మళ్లీ పునరుజ్జీవం రావొచ్చు. అలాంటి ఇంకుడుగుంతలపై అశ్రద్ధ చేయడం మంచిది కాదు. అధికారులు ఇంకుడుగుంతల పునరుద్ధరణపై దృష్టి పెట్టాలి.

– మాధవరెడ్డి, జెక్‌కాలనీ

చుక్కనీరు ఇంకేందుకు అవకాశం ఉన్న మార్గాలను ఒకవైపు అన్వేషిస్తుండగా, ఇంకోవైపు ఇప్పటికే అధ్వాన్న స్థితిలో ఉన్న ఇంకుడుగుంతలను పునర్వినియోగంలోకి తీసుకువచ్చే ఆలోచన చేయకపోవడం బాధాకరం.

దృష్టి సారిస్తే మేలు..

జెక్‌కాలనీలో ఇంకుడుగుంతల పరిస్థితి మరింత అధానంగా మారింది. ఇక్కడ 1500 ఫీట్లు దాటి వెళ్లినా గంగమ్మ జాడ ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. గతంలో వెయ్యి ఫీట్లు లోపు వేసిన బోర్లు ఇప్పటికే మూతపడ్డాయి. కాలనీలో దాదాపు 50 అపార్ట్‌మెంట్లు, రెండు వేల ఫ్లాట్స్, 40 వరకు వ్యక్తిగత గృహాలు, ఎనిమిది వేల జనాభా ఉన్న జెక్‌కాలనీలో నీటి ఇంకే పరిస్థితి చాలా తక్కువ. వేసవి కాలం వచ్చిందంటే ఇక్కడి వారికి ప్రైవేటు ట్యాంకర్ల దిక్కు. ఒక్కో అపార్ట్‌మెంట్‌లో కనీసం 40 నుంచి 200 వరకు ఫ్లాట్స్ ఉండడంతో జల మండలి సరఫరా చేసే నీరు వారి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. దీంతో ఒక్కో అపార్ట్‌మెంట్ కనీసం రోజుకు 4 ట్యాంకర్ల నుంచి 8 ట్యాంకర్ల మేర కొనుక్కోవాల్సి వస్తోంది. ఒక్కో అపార్ట్‌మెంట్‌పై నెలకొచ్చేసరికి సరాసరి 3 లక్షల నుంచి 6 లక్షల మేర కేవలం నీటి కొనుగోలుకే వెచ్చించాల్సి రావడం గమనార్హం. అంటే ఒక్కో గృహ నివాసితుడిపై ఆయా అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల సంఖ్యను బట్టి రూ.3,000 నుంచి 6,000 వరకు అదనపు భారం పడుతోంది. ఇంత భారం పడుతున్నా జెక్‌కాలనీలో నీటి ఇంకించి నీటి ఎద్దడి నివారణకు ఇంకుడుగుంతల నిర్మాణంలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఇంకుడు గుంతలపై అధికారులు దృష్టి సారిస్తే ఎంతో మేలు చేకూరుతోందని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.



స్ట్రీట్ వ్యూ వద్ద ఇలా.

తూతూ మంత్రంగా పునరుద్ధరణ..

కాలనీలో ఎక్కడ ఇంకుడుగుంత చూసినా నీరు ఇంకుడుగుంతలోకి చేరేందుకు వీలులేకుండా పోయాయి. మరికొన్ని పూడుకుపోయాయి. ఇంకొన్ని కనుమరుగయ్యాయి. ఓ వైపు వేలకు వేలు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తుంటే..వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ నీటి మట్టాన్ని పెంచుకునే ఆలోచన కూడా చేయకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రతియేటా వర్షాకాలం ముందు కొత్త ఇంకుడుగుంతలపై ఎన్‌జీఓ సంస్థలతో కలిసి చైతన్య కార్యక్రమాలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప పూర్తిస్థాయిలో పాత ఇంకుడుగుంతల పునరుద్ధరణ జరుగుతుందా? లేదా? అన్న అంశంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముందస్తుగా వచ్చే వర్షాకాలం నాటికైనా ఇంకుడుగుంతల పునరుద్ధరణ చేపడితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

రవీందర్‌నాయక్‌కు నివాళి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి జేఏసీ నేత డాక్టర్ రవీందర్ నాయక్‌కు పలువురు నివాళి అర్పించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట రవీందర్ నాయక్ చిత్రం ఏర్పాటు చేసి నివాళి అర్పించి పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన 5వ సంస్మరణ సభలో పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు, విద్యార్థులు మాట్లాడారు. రవీందర్ నాయక్ పాల్గొన్న వివిధ ఆందోళన కార్యక్రమాలను స్మరిస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.చంద్రునాయక్, గిరిజనశక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్, కరాటే రాజు, వెంకటేష్ చౌహాన్, నెహ్రూనాయక్, సంపత్‌నాయక్, రమేష్ రాథోడ్, అశోక్ నాయక్ పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



నిఖిత, మాన్వీ

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లీకూతుళ్లు అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా వివరాల ప్రకారం.. నార్త్‌లాలాగూడలోని ఆర్యనగర్ ప్రాంతంలో నివాసముంటున్న రాజు, నిఖిత(26) దంపతులు. వీరికి మాన్వీ (03) కుమార్తె ఉంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఏప్రిల్ 29న ఉదయం కూతురు మాన్వీని స్కూల్లో వదిలేసి తాను ఉద్యోగానికి వెళ్తానని చెప్పి కూతురిని తీసుకొని వెళ్లింది. సాయంత్రం స్కూల్ నుంచి మాన్వీని తీసుకురావడానికి ఆమె తాతయ్య స్కూల్ వద్దకు వెళ్లగా రాలేదని చెప్పడంతో అక్కడి నుంచి నిఖిత పని చేసే చోటుకు వెళ్లాడు. ఆమె కూడా ఉద్యోగానికి రాలేదని చెప్పడంతో వెంటనే ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు మాణికేశ్వర్‌నగర్‌లో బొడ్రాయి వార్షికోత్సవం



లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఆదివారం నాభిశిల బొడ్రాయి వార్షికోత్సవం వేడుకలను నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. బస్తీ అంతా స్వాగత తోరణాలు, విద్యుత్ లైట్లతో అలంకరించారు. శనివారం బస్తీ వాసులు బొడ్రాయికి జలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. మాణికేశ్వర్‌నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బస్తీ పెద్దలు మాట్లాడుతూ.. మాణికేశ్వర్‌నగర్‌లోని ప్రజలందరూ బొడ్రాయి పండుగలో భాగస్వాములు కావాలన్నారు. ఉదయం 6 గంటలకు శితలాదేవి నాభిశిల బొడ్రాయికి జలాభిషేకం, 7 గంటలకు పంచామృత స్నానాభిషేకం, 8కి చంద్రపటం, 9 గంటలకు అఖండ జ్యోతులు, ఉ10 గంటలకు దిష్టికుంభం, అనంతరం బైండ్ల కళాకారుల ఆధ్వర్యంలో శీతలాదేవి బొడ్రాయి కథ, మధ్యాహ్నం ఒంటిగంటకు పోతరాజుల విన్యాసాలు, బోనాలు, మంగళహారతులు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పుట్టిన రోజు శుభాకాంక్షలు

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్ కు చెందిన సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్ వంగూరి లాజరస్ తన జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ముందు పార్టీ నాయకుల సమక్షంలో కేక్‌కట్ చేశారు. శ్రీనివాస్, లింగయ్య, రవి, వెంకటేష్, తులసీరాం, మాటియా లాజరస్‌ను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వెండి సామగ్రి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావీద్

అడ్డగుట్ట: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న వెండి సామగ్రిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేట్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే డీఎస్పీ జావీద్ వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పురుషోత్తపట్నంలోని చిలకలూరిపేటకు చెందిన సిద్ధబతుని రంగప్రసాద్(48) వృత్తిరిత్యా సిల్వర్ షాప్ వర్కర్. ఈ నెల 18న గుంటూరుకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ స్టేషన్‌లో రోజువారి తనిఖీలు, సోదాల్లో భాగంగా జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ ప్లాట్ ఫామ్ నెం-02లో రైలు కోసం ఎదురుచూస్తున్న రంగ ప్రసాద్ వద్దకు వెళ్లి అతని బ్యాగు చెక్ తనిఖీ చేయగా సుమారు 3.6 కిలోల వెండి ప్లేట్లు, గ్లాసులు, ఇతర వెండి సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు చేశామన్నారు.

‘కాఫీ టేబుల్ బుక్’ ఆవిష్కరణ



కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్తి సమాచారాన్ని తెలియజేసే కాఫీ టేబుల్ బుక్‌ను వీసీ ప్రొ.రవీందర్ ఆవిష్కరించారు. శనివారం పాలన భవనంలోని సెనెట్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్ బుక్ ప్రాధాన్యతను వివరించి ఆవిష్కరించారు. వివిధ పనుల కోసం ఓయూను సందర్శించే వారి కోసం వీసీ చాంబర్‌తో పాటు రిజిస్ట్రార్ ఇతర అధికారులు, ప్రిన్సిపల్స్ కార్యాలయాల్లోని టేబుళ్లపై కాఫీ బుక్‌ను అందుబాటులో ఉంచుతారు. ఓయూను పర్యవేక్షించేందుకు వస్తున్న యూజీసీ న్యాక్, ఇతర సంస్థల అధికారుల బృందానికి సైతం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు, ప్రింటింగ్ ప్రెస్ మాజీ డైరెక్టర్ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.స్టీవెన్ సన్, పీఆర్వో ప్రొ.ప్యాట్రిక్, ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆదివాసీల హత్యకాండా, మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం సుందయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ, ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ సంయుక్తాధ్వర్యంలో దండకారణ్యంలో మారణహోమాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ.. సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. ఓ వైపు శాంతి చర్చలు అంటూనే మరో వైపు ఆదివాసీలను శవాలుగా మారుస్తూ.. గుర్తించేందుకు వీలు లేకుండా హత్య చేస్తున్నారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు జి.అనురాధ, ప్రొఫెసర్ హరగోపాల్, వేణుగోపాల్, నారాయణరావు, చంద్రశేఖర్, సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ప్రజాగాయని విమలక్క, సామాజిక కార్యకర్త సజయ, రైతు సామాజికవేదిక నాయకులు కన్నెగంటి రవి, మల్లేపల్లి ప్రభాకర్, వివిధ సంఘాల నేతలు క్రాంతి, డీజీ నర్సింహ్మారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 28, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 75, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

డాక్టరేట్ ప్రదానం



హరిసింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేటిక్ టెక్నాలజీ విభాగంలో హరిసింగ్ రత్నావత్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది.సీనియర్ అధ్యాపకులు ప్రొ.వీబీ నరసింహ పర్యవేక్షణలో నెట్వర్క్ ఇన్ట్రూషన్ డిటెక్షన్ ఇన్ హనీ పాట్ ఫ్రేమ్ వర్క్ యూజింగ్ ఏ.ఐ మోడల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. సూర్యాపేట జిల్లా చివ్వెముల మండలం ఎంజీనగర్ తండాకు చెందిన కమలమ్మ-లక్ష్మణ్ నాయక్ దంపతుల కుమారుడైన హరిసింగ్ ఎంసీఏ చేస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. పీహెచ్‌డీకి సహకరించిన మిత్రులు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపాడు.

తార్నాకలో జోరు వాన



లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో శనివారం జోరుగా వర్షం కురిసింది. సాయంత్రం వేళ కావడంతో కార్యాలయాలు, వివిధ పనుల నిమిత్తం ఇళ్లకు వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, వ్యాపారులు తడిసిపోయారు. జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాలాలు, మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. రోడ్లపై వర్షం నీరు వరదలా పారింది.

నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం




సదస్సుకు హాజరైన ప్రతినిధులతో ముఖ్య అతిథులు,నిర్వాహకులు.

సిడాక్ హెడ్ లక్ష్మీ ఈశ్వరి

అమీర్‌పేట: నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సిడాక్ హెడ్ (భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐటీ) డాక్టర్ లక్ష్మీ ఈశ్వరి అన్నారు. ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పరిశోధనలు, సృజనాత్మకత, ఆవిష్కరణలపై 3వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు.అమీర్‌పేట ఆదిత్యపార్క్ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే కొత్త సాంకేతికలపై పట్టు సాధించాల్సిన అవసరముందని వివిధ రంగాల్లో జరుగుతున్న పరిశోధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. పరిశోధనలో సృజనాత్మకతను చేర్చడం, సిడాక్ విధుల గురించి వివరించారు.ఉమెన్ ఆబ్జెక్టిఫికేషన్ ఇన్ మూవీస్ అనే అంశంపై అంజయ్య అనుష నాయక్ సమర్పించిన పరిశోధన పత్రాన్ని పలువురు అభినందించారు.ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 300 మంది ప్రతినిధులు పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించారు.ఉత్తమ పేపర్ ప్రజెంటర్లకు అవార్డులు,సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ ఐటీ అకాడమీ మాజీ డైరెక్టర్ విశనాథ్ నాయక్, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ చాన్సలర్ రూపా వాసుదేవన్, వైస్ చాన్సలర్ నాగజ్యోతి పాల్గొన్నారు.

తెలంగాణ తొలితరం ఉద్యమచరిత్ర గ్రంథస్థం

ప్రొఫెసర్ నసుమాసస్వామి



సమావేశంలో పాల్గొన్న నసుమాసస్వామి, తొలితరం ఉద్యమకారులు

చిలకలగూడ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలితరం పోరాటంలో అమరులైన వీరులు, జైలుకు వెళ్లిన యోధులు, అంగవైకల్యం చెందినవారి త్యాగాలకు చరిత్రలో చోటు దొరకలేదని, ఆ త్యాగధనుల ఉద్యమజీవితాలను గ్రంథస్థం చేయనున్నట్లు తెలంగాణ పోరాటయోధుల సంఘ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ప్రొఫెసర్ నసుమాసస్వామి తెలిపారు. 1968–69లో రెండేళ్ల పాటు జైలు జీవితం గడిపిన తొలితరం తెలంగాణ ఉద్యమకారులు జనగామ జిల్లాకు చెందిన ఆడెపు వెంకయ్య, అనుముల రామయ్య, ఇన్నారెడ్డి, ఉపేందరరావులతో కలిసి సీతాఫల్‌మండిలో శనివారం జరిగిన దశాబ్ది సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. పీడీచట్టం, కోర్టుల ద్వారా అరెస్టయిన 2100మంది తొలితరం తెలంగాణ ఉద్యమకారుల వివరాలతో కూడిన సర్టిఫికెట్లను సేకరించి ప్రభుత్వానికి అందించామన్నారు. 2023 ఫిబ్రవరి నుంచి హైకోర్టు ద్వారా 82 మంది పింఛన్లు పొందుతుండగా, మరో 122 మంది కోర్టును ఆశ్రయించారని వివరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచిందని, ఇప్పటికైనా తెలంగాణ తొలితరం ఉద్యమకారుల జీవితాలను వెలుగులోకి తేవాలనే సంకల్పంతో వారి చరిత్రను గ్రంథస్థం చేసేందుకు నిర్ణయించినట్లు నసుమాసస్వామి స్పష్టం చేశారు.

మజ్జిగ ప్రభాకర్‌కు ఘన నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి మాజీ కార్పొరేటర్ మజ్జిగ ప్రభాకర్ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ బి-బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వద్ద మాజీ కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి మూడో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభాకర్‌రెడ్డి గొప్ప ప్రజానాయకుడని పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. నాయకులు కుంబర్తి శివకుమార్, బబ్లూ, కన్న, నవీన్‌నాయక్, రమేష్, ప్రేమ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

రసూల్‌పురా: నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు చేపట్టి బస్తీవాసుల సమస్యను పరిష్కరిస్తామని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. శనివారం రసూల్‌పురా ఇందిరమ్మనగర్ పెద్దరోడ్డులో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి సీఈవో పర్యటించారు. గత కొన్నేళ్లుగా వర్షకాలంలో డ్రైనేజీ లైన్ ద్వారా వరదనీరు సాఫీగా ప్రవహించకుండా డ్రైనేజీనీటితో కలిసి ఇళ్లల్లోకి చేరుతోందని, రోడ్లపై మోకాళ్ల లోతు నీరు ఉంటోందని దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానిక బీఆర్ఎస్ నేత జంగిలి రాజు సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఈవో మధుకర్ నాయక్ మాట్లాడుతూ త్వరలో నూతన డ్రైనేజీ పైపులైను అభివృద్ధి చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అధికారులు ఉమాశంకర్, ఫణికుమార్, శానిటేషన్ సూపరింటెండెంట్ ఎం. దేవేందర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ చౌహాన్ ఉన్నారు.

పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెంటర్ ఫర్ ప్లాంట్ మాలిక్యూలర్ బయోలజీ (సీపీఎంబీ) డైరెక్టర్ డా.రామకృష్ణ రచించిన బయో మెడికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ సాలిడ్ కేన్సర్స్ అనే పుస్తకాన్ని వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఎపిడెమియాలజీ, ప్రమాద కారకాలు, రోగ నిర్ధారణ, వర్గీకరణ, జన్యుశాస్త్రం, చికిత్స, ప్రస్తుత సవాళ్ల తదితర కేన్సర్ సంబంధిత వివిధ అంశాలను పుస్తకంలో పొందుబరిచినట్లు రామకృష్ణ తెలిపారు. నగరంలోని జీవ శాస్త్రవేత్తలు, వైద్యులు, పరిశోధక విద్యార్థుల నెట్ వర్కింగ్‌తో పుస్తకాన్ని పుస్తకాన్ని రూపొందించినట్లు వివరించారు. మెడికల్, లైఫ్ సైన్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నేడు ఉచిత ఆరోగ్య శిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేడు ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో సీనియర్ ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాస్, కంటివైద్యులు కులశేఖర్, నిలోఫర్ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యులు కేవీఎస్ నారాయణ, ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్లు శ్రీవర్ధన్, సుధీర్‌తో పాటు వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, స్క్రీనింగ్ పరీక్షలతో పాటు నేత్ర, రక్త పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పిల్లలకు ఆరోగ్య సంబంధమైన పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.